BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 31 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## జీఎస్టీ ఎగవేతలకు అడ్డుకట్ట వేయాలి

- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వస్తు, సేవల పన్ను(జీఎస్టీ)ల ఎగవేతలకు అడ్డుకట్ట వేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో వాణిజ్య పన్నుల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. జీఎస్టీ పరిధిలోని సంస్థలు సక్రమంగా పన్ను చెల్లించేలా చూడాలని సూచించారు. అదే సమయంలో చెల్లింపుదారులకు సంబంధించి అనుమానాలు, సందేహాల నివృత్తికి కాల్‌సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సెంటర్ నిర్వహణలో ఏఐను వినియోగించుకోవాలని తెలిపారు. జీఎస్టీ, ఇతర పన్నుల విషయంలో పొరుగు రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాలను అధ్యయనం చేసి మేలైన విధానాలను స్వీకరించాలని సూచించారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించేలా కార్యాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, వాణిజ్య పన్నుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, వాణిజ్య పన్నుల శాఖ డైరెక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

# కొత్త డిస్కమ్‌ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- విద్యుత్ రంగ సంస్కరణలకు శ్రీకారం
- వ్యవసాయం, ఉచిత గృహ విద్యుత్, స్కూళ్ళకు కొత్త డిస్కమ్ పరిధి
- డిస్కమ్‌ల ఆర్థిక స్థితి మెరుగుదలకై రుణ రీస్ట్రక్చరింగ్ ఆవశ్యకం
- ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వినియోగం
- సచివాలయానికి సోలార్ షెడ్లతో వాహనాల పార్కింగ్
- గిరిజన ప్రాంతాల్లో 'ఇందిర సోలార్ గిరి జల వికాసం' విస్తరణ
- మూడేళ్లలో 2.10 లక్షల ఎస్టీ రైతులకు సౌర పంపుసెట్లు లక్ష్యం
- విద్యుత్ శాఖపై సీఎంతో సమీక్షలో కీలక నిర్ణయాలు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ దిశగా సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉన్నట్లు పేర్కొంటూ, కొత్తగా మరో డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (డిస్కమ్) ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జూబ్లీహిల్స్ సీఎం నివాసంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు విద్యుత్ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్‌లతో పాటు ఒక కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేసి, దాని పరిధిలో వ్యవసాయ రంగం, 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ వంటి పథకాలన్నీ తీసుకురావాలని సూచించారు. రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా ఈ కొత్త డిస్కమ్ పరిధిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

**డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడుతుంది**

కొత్త డిస్కమ్ ఏర్పాటుతో ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌ల పనితీరు మెరుగవుతుందని, జాతీయ స్థాయిలో రేటింగ్ పెరుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. వాటి ఆర్థిక స్థితి పటిష్టంగా ఉండేందుకు సంస్కరణలు తప్పనిసరి అని పేర్కొన్నారు.

**రుణభార తగ్గించాలి**

విద్యుత్ సంస్థలపై ఉన్న రుణభారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని, దానికి తగిన విధంగా తక్కువ వడ్డీతో రీస్ట్రక్చరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. 10 శాతం వడ్డీపై తీసుకున్న రుణాల కారణంగా డిస్కమ్‌లు నష్టాల్లో ఉన్నాయని వివరించారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, కలెక్టర్లు తగిన భవనాలను గుర్తించాలన్నారు. ముఖ్యంగా సచివాలయంలో వాహనాల పార్కింగ్ కోసం సోలార్ షెడ్లను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ శాఖతో సమన్వయం కల్పించాలని తెలిపారు.

**ఇందిర సోలార్ గిరి జల వికాసం పథకం**

గిరిజన ప్రాంతాల్లో ఇందిర సోలార్ గిరి జల వికాసం పథకాన్ని అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ పథకం కింద వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోని 2.10 లక్షల ఎస్టీ రైతులకు సౌర విద్యుత్ పంపుసెట్లు అందించాలని, 6 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.

## భారత్‌పై 25 శాతం సుంకాలు..

- రేపటి నుంచి అమల్లోకి..



బలగం టీవీ, వాషింగ్టన్

భారత్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ షాక్ ఇచ్చారు. భారతదేశం నుంచి దిగుమతి చేసే వస్తువులపై 25 శాతం అదనపు సుంకాలు విధించనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ కొత్త సుంకాలు ఆగస్టు 1 నుండి అమలులోకి రానున్నాయని స్పష్టం చేశారు.

**"భారత్ మిత్ర దేశమే కానీ వ్యాపారం సమానంగా లేదు"**

ట్రంప్ తన స్వంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' లో ఈ ప్రకటన చేశారు. "భారత్ మిత్ర దేశం అయినప్పటికీ, గత కొన్నేళ్లుగా వారితో అమెరికా వ్యాపారం తక్కువగానే ఉంది. ఎందుకంటే భారత్ విధించే సుంకాలు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయి. పైగా, ద్రవ్యేతర వాణిజ్య అడ్డంకుల పరంగా కూడా భారత్ చాలా కఠినంగా వ్యవహరిస్తోంది" అని విమర్శించారు.

ఉక్రెయిన్‌పై రష్యా దాడులను అంతర్జాతీయ సముదాయం వ్యతిరేకిస్తున్నప్పటికీ, భారత్ మాత్రం చైనాతో కలిసి రష్యా నుంచి చమురు దిగుమతులు కొనసాగిస్తున్నదని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "భారత్ ఎప్పటికప్పుడు తమ రక్షణ పరికరాలను రష్యా నుంచే కొనుగోలు చేస్తోంది. ఇది అమెరికా వ్యతిరేకంగా ఉన్నదని స్పష్టంగా తెలుస్తోంది" అని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

ఇప్పటికే అమెరికా యూకే, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, జపాన్, యూరోపియన్ యూనియన్‌లతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. కానీ భారత్‌తో మాత్రం ఇంకా నిర్ణయం వెలువడలేదు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో చర్చల దశ కీలక మలుపు తిరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

## పహల్గాం దాడిలో లష్కరే తోయిబా పాత్ర



- రాజ్యసభలో హోంమంత్రి అమిత్ షా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

"పహల్గాం ఉగ్రదాడి బాధితుల కుటుంబాలు, పలువురు ప్రజలు ఆ ఉగ్రవాదులను తలపై కాల్చాలంటూ కోరారు. మన బలగాలు 'ఆపరేషన్ మహాదేవ్'లో అదే పని చేశాయి" అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ ఆపరేషన్ మహాదేవ్‌లో మృతి చెందిన ముగ్గురు ఉగ్రవాదులు లష్కరే తోయిబాకు చెందినవారని, దాంతో పహల్గాం దాడి వెనుక ఆ ఉగ్రసంస్థ హస్తం స్పష్టమైందని చెప్పారు. మహిళలు, చిన్నారుల ముందే మతం అడిగి చంపినంత అనాగరిక చర్య గతంలో ఎప్పుడూ జరగలేదని విమర్శించారు.

**కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కంటే రాజకీయాలే ముఖ్యం**

ప్రధాన మంత్రి మాట్లాడాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు సభను బహిష్కరించిన అనంతరం, తన ప్రసంగాన్ని కొనసాగించిన షా కాంగ్రెస్ నేత చిదంబరం తన రాజీనామా కోరారని, ఉగ్రవాదులు పాకిస్థాన్‌కి చెందిన వారేనన్నదాన్ని రుజువు చేయాలని డిమాండ్ చేశారని తెలిపారు. చిదంబరం ఆపరేషన్ సిందూర్ సమర్థతను కూడా ప్రశ్నించారని పేర్కొన్నారు. "కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కంటే ఓటు బ్యాంకు రాజకీయాలే ముఖ్యమైపోయాయి. బుజ్జగింపు రాజకీయాలు వారి అసలైన ముఖచిత్రం" అని ఆరోపించారు.

**'మహాదేవ్' అనే పేరు పెట్టడమే తప్పా?**

ఆపరేషన్ మహాదేవ్ పేరిట ఉగ్రవాదుల ఎదుర్కొన్న ఘటనపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చౌహాన్‌పై అమిత్ షా ఎద్దేవా చేశారు. "శివాజీ మహారాజ్ మొఘలులపై పోరాటాల్లో 'హరహర మహాదేవ్' అని నినాదం చేశారు. భారత సైనికుల యుద్ధ నినాదాలు భక్తి భావంతో ఉన్నవే కానీ, హిందూ–ముస్లిం మతాలకి సంబంధించి కావు" అని స్పష్టం చేశారు. తీవ్ర భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల్లో శత్రువుల్ని వెంబడించి, డ్రోన్‌ల ద్వారా పంపిన ఆహారాన్ని తీసుకుంటూ పని చేసిన సీఆర్‌పీఎఫ్, ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసుల కృషిని అమిత్ షా కొనియాడారు. "వారు పట్టు, శక్తి, ధైర్యంతో ఉగ్రవాదుల్ని ఎరిపట్టారు" అని ఆయన పేర్కొన్నారు.

# రష్యాలో భారీ భూకంపం



- రిక్టర్‌పై 8.8 తీవ్రత..
- సునామీ హెచ్చరికలు జారీ చేసిన దేశాలు

బలగం టీవీ, మాస్కో

రష్యా తూర్పు తీరంలో బుధవారం ఉదయం భీకర భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 8.8గా నమోదు కావడంతో, పసిఫిక్ మహాసముద్ర పరిధిలోని అనేక దేశాలు అప్రమత్తమయ్యాయి. రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంతో పాటు జపాన్‌కు సునామీ హెచ్చరికలు జారీ చేయగా, అమెరికాలోని హవాయికి కూడా అధికారులు అలర్ట్ జారీ చేశారు.


జపాన్ వాతావరణ శాఖ ప్రకారం, ఈ భూకంపం ఉదయం 8:25 గంటలకు సంభవించింది. ప్రారంభంలో దీని తీవ్రత 8.0గా నమోదైనట్టు తెలియజేసిన యూఎస్ జియోలాజికల్ సర్వే అనంతరం దాన్ని 8.8గా అప్‌డేట్ చేసింది. భూకంప కేంద్రం జపాన్‌కు చెందిన నాలుగు ప్రధాన దీవుల్లో ఉత్తరాన ఉన్న హక్కైడోకు 250 కిలోమీటర్ల దూరంలో నమోదైనట్టు తెలిపింది. ఈ భారీ భూకంపంతో సముద్ర గర్భంలో తీవ్రంగా అలజడి రేగినట్టు యూఎస్‌జీఎస్ అంచనా వేసింది. ఫలితంగా రష్యా, జపాన్ తీరప్రాంతాల్లో భారీ సునామీ అలలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అలస్కాలోని అల్యూటియన్ దీవుల్లో సునామీ ప్రభావం ఉండే అవకాశం ఉందని అలస్కా నేషనల్ సునామీ సెంటర్ వెల్లడించింది. ఇక అమెరికాలోని కాలిఫోర్నియా, ఒరెగాన్, వాషింగ్టన్, హవాయిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశాయి.

రష్యాలోని పెట్రోపావ్లోవ్స్క్–కామ్చాట్కా నగరంలోని భవనాలు ఊగిపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురై ఇళ్ల నుంచి పరుగులు తీశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రజలు రోడ్లపైకి వచ్చి తమ బంధువులకు సమాచారం తెలియజేస్తూ కనిపించారు.

ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్టు అధికారిక సమాచారం ఏదీ లేదు. అయితే 8.8 తీవ్రత కలిగిన భూప్రకంపన కావడం వల్ల తీవ్రంగా నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా పసిఫిక్ తీర ప్రాంతాల్లో భారీ ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అమెరికా బ్లాక్‌మెయిల్‌కు భయపడొద్దు

- కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం అదనపు సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇది దేశానికి, ఆర్థిక వ్యవస్థకు, ప్రధాని మోదీకి పెద్ద ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ మండిపడ్డారు. అమెరికా చర్యను బ్లాక్‌మెయిల్‌గా అభివర్ణించిన ఆయన, ప్రధాని మోదీ భయపడకుండా ధైర్యంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. "ప్రధానమంత్రి మోదీ ఇప్పటివరకు ట్రంప్‌పై చేసిన ప్రశంసలేమీ ఫలితమివ్వలేదని, హౌడీ మోదీ, నమస్తే ట్రంప్ కార్యక్రమాల నుంచి దేశానికి ఎలాంటి లాభాలు కలగలేదని" జైరాం రమేష్ ఎద్దేవా చేశారు. "ఇది మోదీకి రాజకీయంగా, ఆర్థికంగా పెద్ద దెబ్బ. 'తారీఫ్ హీ తారీఫ్ మే టారిఫ్ లాగ్ గయా'. అధ్యక్షుడు ట్రంప్ 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేసినట్లు ఇప్పటికే 30 సార్లు చెప్పారు. మరి ఈ స్నేహం వల్ల మాకు ఏమి లాభం?" అని ప్రశ్నించారు.

భారత్ ఎక్కడి నుంచి చమురు కొనుగోలు చేయాలనేది ట్రంప్ నిర్ణయించలేడని స్పష్టం చేశారు. "ఇది మన పరిశ్రమలపై, ఇంజినీరింగ్, ఫార్మా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పాకిస్థాన్, చైనాతోపాటు ఇప్పుడు అమెరికా కూడా మూడో పెద్ద సవాలుగా మారింది," అని అన్నారు. దేశంలో ఈ స్థాయి సంక్షోభం నెలకొన్నా ప్రధాని రాజ్యసభకు హాజరుకాలేదని జైరాం విమర్శించారు. "ఇది కష్టకాలం. ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా మేము మౌనం వహించం" అని హెచ్చరించారు.

## నిసార్ ప్రయోగం విజయవంతం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



భారతదేశం, అమెరికా సంయుక్తంగా అభివృద్ధి చేసిన తొలి అత్యాధునిక భూ పరిశీలనా ఉపగ్రహం 'నిసార్' ప్రయోగం విజయవంతమైంది. బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట శార్ష్ కేంద్రం నుంచి జీఎస్ఎల్‌వీ–ఎఫ్16 రాకెట్ ద్వారా నిసార్ నింగిలోకి దూసుకెళ్లింది. 2,393 కిలోగ్రాముల బరువు గల ఈ శాటిలైట్‌ను భూమికి 745 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్టు ఇస్రో తెలిపింది. పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభించడానికి కొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని వెల్లడించింది.

భూ ఉపరితల మార్పులు, అంటార్కిటికాలో మంచు పలకల కదలికలు, పర్యావరణ మార్పులు, సముద్రాల స్థితిగతులు వంటి అంశాలపై లోతుగా అధ్యయనం చేయడమే నిసార్ ప్రయోగం ముఖ్య లక్ష్యం. భూమిపై కేవలం ఒక సెంటీమీటర్ మార్పును కూడా గుర్తించే సామర్థ్యం ఈ శాటిలైట్‌కు ఉంది. భూకంపాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాద ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరికలిచ్చే డాటాను ఇది అందించనుంది. ప్రకృతి విపత్తులపై సమర్థంగా స్పందించేందుకు ఇది ప్రభుత్వాలకు కీలకంగా మారనుంది. ఇస్రో, నాసా కలిసి అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహం జీవిత కాలం 5 సంవత్సరాలు. ఇందులోని అత్యాధునిక పరికరాలైన ఎల్–బ్యాండ్ రాడార్, హైస్పీడ్ డౌన్‌లింక్, జీపీఎస్ రిసీవర్ వంటి భాగాలను అమెరికా నాసా అందించగా, ఇతర భాగాలను ఇస్రో రూపొందించింది. ఇప్పటివరకు ఇస్రో, నాసా అభివృద్ధి చేసిన రాడార్లలో నిసార్ అత్యంత శక్తివంతమైనదిగా ఇస్రో పేర్కొంది.

## వాణిజ్య పన్నుల శాఖల తనిఖీల్లో భారీ మోసం

- సరుకులు రవాణా చేయకుండానే బిల్లులు జారీ
- రూ.33.20 కోట్లు ట్యాక్స్ క్రెడిట్ పొందిన కీషాన్ ఇండస్ట్రీస్
- వాణిజ్య పన్నుల శాఖ తనిఖీల్లో వెల్లడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు





బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వాణిజ్య పన్నుల శాఖల తనిఖీల్లో భారీ మోసం బయటపడింది. సరుకులు రవాణా చేయకుండానే అందుకు సంబంధించి బిల్లులు జారీ చేస్తూ పెద్ద ఎత్తున మోసానికి పాల్పడినట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లోని కీషాన్ ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పీ కంపెనీ పన్నులు చెల్లించకుండానే అక్రమాలకు తెరలేపింది. సంస్థ చేస్తున్న మోసాలను పసిగట్టిన అధికారులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయం, సికింద్రాబాద్‌లోని బన్సీలాల్‌పేట్ గోదాం, మెదక్ జిల్లాలోని కలకల్ ఆటోమోటివ్ పార్క్, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల్లోని తయారీ యూనిట్లపై ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం సంస్థ సరుకులు తరలించకుండా భారీ విలువ కలిగిన కాపర్‌కు సంబంధించి ట్యాక్స్ బిల్లులు జారీ చేసినట్లు గుర్తించారు. ఖాళీ వాహనాలను తెలంగాణ నుంచి మహారాష్ట్రకు పంపించగా, డాక్యుమెంట్లలో మాత్రం భారీ సరుకుల రవాణా జరిగినట్టు చూపించారు. మోసపూరిత బిల్లుల మొత్తం విలువ రూ.100 కోట్లకుపైగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ మోసం జాతీయ రహదారి టోల్‌గేట్ డేటా విశ్లేషణ ద్వారా వెలుగులోకి వచ్చింది. వాహనాలు తిరగని పరిస్థితిలోనూ, ఈ–వే బిల్లులపై వాటిని సరుకులతో వెళ్ళినట్టు చూపారు. సంస్థ సుమారు రూ.33.20 కోట్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను నకిలీ లావాదేవీల ద్వారా పొందినట్టు కనుగొన్నారు. ఇది తెలంగాణలో కనుగొన్న కొత్త రకం జీఎస్టీ మోసంగా భావిస్తున్నారు. పన్ను ఎగవేతలో ఓ కొత్త, ప్రమాదకర ధోరణిని సూచిస్తోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల సందర్భంగా అధికారులు ఖాతా పుస్తకాలు, రిజిస్టర్లు, హార్డ్ డిస్కులు, సీసీటీవీ ఫుటేజ్ తదితర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. సంస్థ డైరెక్టర్లు వికాస్ కుమార్ కీషాన్, రజనీష్ కీషాన్‌పై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు హైదరాబాద్ లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీసీపీకి ఫిర్యాదు చేశారు.

## నేటి నుంచి కాంగ్రెస్ పాదయాత్ర

- ఆగస్టు 4 వరకు పాదయాత్ర, శ్రమదాన కార్యక్రమం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పార్టీ సంస్థాగత అంశాలు, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్లపై కార్యాచరణను ఖరారు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో వారు సమావేశమయ్యారు. దాదాపు గంటన్నరపాటు సుదీర్ఘంగా చర్చించారు. గురువారం నుంచి ఆగస్టు 4 వరకు పాదయాత్ర, శ్రమదాన కార్యక్రమం యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిగి నియోజకవర్గం నుంచి పాదయాత్ర ప్రారంభమై... ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ వరకు యాత్ర సాగనుంది. మరోవైపు 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీ వేదికగా ఉద్యమించేందుకు కార్యాచరణ ప్రకటించారు. ఆగస్టు 5, 6,7 తేదీల్లో ఢిల్లీలో మకాం వేసి కేంద్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించారు. ఢిల్లీలో జరగనున్న ధర్నాకు ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది చొప్పున ప్రత్యేక రైల్లో హస్తినకు పయనం కానున్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారు.

ఆగస్టు 5న లోక్‌సభ, రాజ్యసభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుపట్టడం

6న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా

7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందజేయడం

## అల్‌ఖైదా మహిళా ఉగ్రవాది అరెస్ట్

- బెంగళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సోషల్ మీడియా ద్వారా ఉగ్ర ప్రచారం చేస్తోందని గుర్తింపు


వివరాలు 2వ పేజీలో


## రిమ్స్‌లో ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్య

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లాలోని రాజీవ్ గాంధీ మెడికల్ సైన్స్ ఇన్స్టిట్యూట్ (రిమ్స్) లో విషాదం చోటుచేసుకుంది. రెండో సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థి సాహిల్ చౌదరి (23) హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనతో కళాశాలలో విషాద ఛాయలు అలముకున్నాయి. 2023–24 బ్యాచ్‌కు చెందిన సాహిల్, రాజస్థాన్‌లోని జైపూర్ ప్రాంతానికి చెందిన జాట్ తెగకు చెందినవాడిగా గుర్తించారు. బాయ్స్ హాస్టల్‌లో నివాసముండే అతను సోమవారం తన గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. హాస్టల్ గదిలోని విండో కర్టెన్‌ను తాడుగా వాడి, ఫ్యాన్‌కు బిగించి ఉరివేసుకున్నట్లు సమాచారం. గది తలుపులు మూసివుండటాన్ని గమనించిన స్నేహితులు అలర్ట్ అయి గది తలుపులు ఓపెన్ చేశారు. వెంటనే అతన్ని ఎంసీయూఐకి తరలించినప్పటికీ, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు.సాహిల్ ఆత్మహత్యకు గల కారణం వెంటనే తెలియరాలేదు. అయితే, ఆగస్టు 2వ తేదీ నుండి ఎంబీబీఎస్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం కావడంతో.. మానసిక ఒత్తిడితో ఈనిర్ణయం తీసుకున్నాడని సహచరులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై టూ టౌన్ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ "సెల్ ఫోన్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం" అన్నారు.

## అంతర్జాతీయ సైబర్ మోసగాళ్ల ముఠా అరెస్ట్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లాలోని రామగుండం పోలీసులు అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ఓ సైబర్ మోసాల ముఠాను అరెస్ట్ చేశారు. జన్నారం మండలంలోని వోడాఫోన్ టవర్ ప్రాంతంలో అనుమానాస్పద సిగ్నల్ లభించడంతో, టెలికమ్యూనికేషన్ విభాగం సహకారంతో పోలీసులు విజిలెన్స్ ఆపరేషన్ చేపట్టారు. ఇందులో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

డీసీపీ ఎగ్గిడి భాస్కర్ వెల్లడించిన వివరాల ప్రకారం... అరెస్ట్ అయిన నిందితులు మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన యాండ్రాపు కామేష్, జగిత్యాల జిల్లా వాసులు బాపయ్య యాదవ్, మధుకర్ యాదవ్, మంచిర్యాల జిల్లాకు చెందిన గోట్ల రాజేష్ యాదవ్ అని తెలిపారు. ఈ ముఠా గతంలో కాంబోడియాలో పనిచేసి, అక్కడి నుంచే ఫేక్ సిమ్ కార్డులు, ల్యాప్‌టాప్‌లు, నెట్‌వర్క్ పరికరాలు దిగుమతి చేసుకున్నారు. అద్దె ఇంట్లో ఫ్రాడ్ సెటప్ ఏర్పాటు చేసి, భారత్‌లో మోసాలకు పాల్పడుతున్నారు.

పోలీసులు వారి నుంచి మొత్తం 262 ఫేక్ సిమ్ కార్డులు, అలాగే ఫైబర్ నెట్, డీలింక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ రెడ్డి, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు కృష్ణమూర్తి, శ్రీనివాస్, ఎస్సైలు అనూష, సురేష్, తహసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. వీరందరినీ డీసీపీ భాస్కర్ అభినందించారు. పౌరులు ఇటువంటి మోసాల నుండి అప్రమత్తంగా ఉండాలన్నారు.

# బీజేపీ తమిళనాడు ఉపాధ్యక్షురాలిగా ఖుష్బు

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ నటి, భారతీయ జనతా పార్టీ నాయకురాలు ఖుష్బుకు పార్టీలో కీలక పదవి దక్కింది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ ఆమెను రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షురాలిగా నియమించింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అంగీకారంతో కొత్త కార్యవర్గాన్ని నియమించినట్లు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 14 మంది నియమితులు కాగా జాబితాలో ఖుషబ్బకు చోటు దక్కింది. అలాగే బిజెపి రాష్ట్రప్రధాన కార్యదర్శులుగా ఐదుగురు, కార్యదర్శులుగా 14 మందితో కూడిన జాబితాను నాగేంద్రన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఖుషబ్బ ప్రస్తుతం జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా, బిజెపి జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా ఉన్నారు.

# రూ.40 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

**బలగం టీవీ, హైదరాబాద్**

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా హైడ్రోఫోనిక్ గంజాయిని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టులో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో విస్తృతంగా తనిఖీ చేపట్టింది. బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి నంచి 400 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను అందుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, పట్టుబడిన హైడ్రోఫోనిక్ గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.40 కోట్ల వరకు ఉంటుందని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యాంకాక్ నుంచి భారత్‌లోని వివిధ ప్రాంతాలకు నేరుగా విమాన సర్వీసులున్నా సదరు మహిళా అనుమానం రాకుండా ఉండేందుకు ఆమె బ్యాంకాక్ నుంచి దుబాయ్ మీదుగా భారత్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

# అల్‌ఖైదా మహిళా ఉగ్రవాది అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**

అల్ ఖైదా టెర్రర్ మాడ్యూల్ మాస్టర్ మైండ్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ పోలీసులు అరెస్టు చేశారు. అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ మాడ్యూల్ కీలక కుట్రదారు 30 ఏళ్ల షమా పర్వీన్‌ను కర్ణాటకలోని బెంగళూరులో అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. దేశంలో ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న వారిని గుర్తించేందుకు అధికారులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగానే ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. షమా పర్వీన్ రెండు ఫేస్‌బుక్ పేజీలను నిర్వహిస్తోందని, దాదాపు 10 వేల మంది ఫాలోవర్లున్న ఇన్‌స్టాగ్రామ్ పేజీ కూడా ఉందని, వీటిలో ఆమె భారత వ్యతిరేక మత బోధకుల రెచ్చగొట్టే ప్రసంగాలను వ్యాప్తి చేస్తోందని ఎటిఎస్ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ నెల 23న ఈ మాడ్యూల్‌తో సంబంధం ఉన్న నలుగురు ఉగ్రవాదులను ఢిల్లీ, నోయిడాలో అరెస్టు చేశారు. వీరంతా ఒక ఆటో డిలీటెడ్ యాప్ ద్వారా సంప్రదింపులు జరుపుకునే వారని, దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఈ గ్రూపునకు సంబంధించిన సభ్యులున్నారని కూడా వారు తెలిపారు. వీరందరికీ షమా పర్వీన్ నాయకత్వం వహిస్తోందని, వివిధ ప్రాంతాల్లో ఉగ్రదాడులు జరపడానికి ప్లాన్ కూడా వేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రూపునకు చెందిన ఇతర మద్దతుదారులు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిపే వారి కోసం గాలింపు కొనసాగుతుందని కూడా వారు తెలిపారు.

# వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్ తప్పనిసరి

- **సెప్టెంబర్ 30 చివరి గడువు**
- **రవాణాశాఖ**

**బలగం టీవీ, హైదరాబాద్**

2016 ఏప్రిల్‌కు ముందు తయారైన అన్ని వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి అని రవాణాశాఖ స్పష్టం చేసింది. తాజాగా వచ్చిన ఆదేశాల మేరకు, సెప్టెంబర్ 30 చివరి తేదీగా నిర్ణయించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ గడువుతప్పితే వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు యజమానిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయనున్నట్టు రవాణాశాఖ అధికారులు హెచ్చరించారు.

కొత్త రవాణా చట్టం ప్రకారం హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేకుంటే పాత వాహనాలను విక్రయించడం సాధ్యం కాకపోవడంతోపాటు, రవాణాశాఖ, పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదవుతాయని అధికారులు పేర్కొన్నారు. అలాగే బీమా, కాలుష్య ధ్రువపత్రాలు కూడా జారీ చేయబడవని వివరించారు. నంబర్‌ప్లేట్లకు సంబంధించి రవాణాశాఖ రూపొందించిన వెబ్‌సైట్ www.siam.in ఆధారంతో పొందవచ్చుని అధికారులు తెలిపారు. అలాగే ఆ వాహనాల రకాలను బట్టి నంబర్ ప్లేట్లకు కనిష్ఠంగా రూ.320, గరిష్ఠంగా రూ.800 వరకు చార్జీలను ఖరారు చేసినట్టు వెల్లడించారు.

# ప్రకాశ్‌రాజ్‌ను విచారించిన ఈడీ

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్, "జంగిల్ రమ్మీ" బెట్టింగ్ యాప్ ప్రచారానికి సంబంధించిన కేసులో ఈడీ అధికారులు విచారించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆయనను ఈడీ అధికారులు ఐదు గంటల పాటు విచారించారు. జంగిల్ రమ్మీ బెట్టింగ్ యాప్ ప్రచారంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రకాశ్‌రాజ్ నుంచి ఈడీ స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. అనంతరం ప్రకాశ్‌రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. 2016లో జంగిల్ రమ్మీ యాప్‌కు ప్రచారం చేశా నని, ఇందుకు నిర్వాహకుల నుంచి తనకు డబ్బులు అందలేదని చెప్పారు.

# అమెరికా సుంకాలపై కేంద్రం స్పందన

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్ దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకం విధించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. జాతీయ ప్రయోజనాలను రక్షించడానికి అవసరమైన అన్ని వ్యూహాత్మక చర్యలు తీసుకుంటామని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ట్రంప్ నిర్ణయం ఉక్కు, అల్యూమినియం, ఔషధాలు, కాపడుల ఉత్పత్తులు (టెక్స్‌టైల్స్) వంటి రంగాలపై తీవ్ర ప్రభావం చూపవచ్చని నిపుణుల అభిప్రాయం. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషించడం, ఇతర వాణిజ్య భాగస్వాములతో చర్చలు జరపడం వంటి చర్యలను భారత్ ప్రారంభించనున్నట్టు సంకేతాలు వెలువడ్డాయి.

"దేశీయ పరిశ్రమలను రక్షించడానికి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని అడుగులు వేస్తాం. అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకుంటాం." ం వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులు ఈ చర్యలతో భారత్–అమెరికా వాణిజ్య సంబంధాలపై దీర్ఘకాలిక ప్రభావం ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అయితే, భారత్ దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనగలదన్న ధీమాను కేంద్రం వ్యక్తం చేసింది.

# కాంగ్రెస్ అంటేనే మోసం..

**మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవి శంకర్ నాయకత్వంలో బిఆర్ ఎస్? పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తిరిగి పార్టీ సొంతగూటికి చేరుకున్న తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామని హామీ ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని ఆరోపిస్తూ, తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్ తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవి శంకర్ గారి నాయకత్వంలో, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఈ చేరిక జరిగింది.

ఈ సందర్భంగా అక్కెనపెల్లి కరుణాకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడిగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కారని విమర్శించారు. సర్పంచులు తమ పెండింగ్ బిల్లులు కోరితే, "ఇవి మా కాంగ్రెస్ పార్టీ హయాంలో చేసిన అభివృద్ధి పనులు కావు" అని చెప్పి మాట మార్చారని ఆరోపించారు. మాట మార్చిన ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకురావడంతో, ఉద్యమం చేస్తున్న సర్పంచులను అక్రమంగా అరెస్టులు చేసి తీవ్రంగా ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు.

"కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గ్రామ ప్రథమ పౌరులకే ఇలాంటి పరిస్థితి ఉందంటే రాష్ట్రంలో సాధారణ ప్రజల పరిస్థితి ఏ విధంగా ఉందో కళ్ళకు కట్టినట్టు అర్థమవుతుంది," అని కరుణాకర్ అన్నారు. సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇవ్వమని అడిగితే, "మీరు ఏమైనా మా హయాంలో చేసినారా?" అంటూ అవగాహనారాహిత్యంతో, కక్ష సాధింపుతో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి గతంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తుంచుకోవాలని హితవు పలికారు. సర్పంచులు చేసిన అభివృద్ధి పనులు ప్రజల కోసమే తప్ప ఎవరి స్వలాభానికి కాదని గుర్తు చేశారు. అదేవిధంగా, మీరు అధికారంలోకి రాకముందు చేసిన పనులకు మేమెందుకు బిల్లులు చెల్లించాలని మూర?త్వపు ఆలోచనతో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, గత ప్రభుత్వంలో నిర్మించిన రాష్ట్ర సచివాలయం, జిల్లాల వారీగా సమీకృత కార్యాలయాలు, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వినియోగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. "అలాంటప్పుడు గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ప్రభుత్వ కార్యాలయాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత మీరు కూర్చొని పరిపాలన చేస్తలేరా అని మేము సూటిగా ప్రశ్నిస్తున్నాం," అని ఆయన అన్నారు.

కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి ప్రజలను మోసం చేసే పార్టీ అని, సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయకుండా, అబద్ధపు ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని కరుణాకర్ దుయ్యబట్టారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగములు, పింఛన్లు పెంచుతామని చెప్పి మరెన్నో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే ఉద్యమ పార్టీ అయిన బీఆర్‌ఎస్ తోనే సాధ్యమవుతుందని ప్రజలకు వివరించారు. ప్రజలకు రావాల్సిన ఆరు గ్యారెంటీలు మరియు సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు పార్టీలోనే ఉండి పోరాటం చేస్తామని, అందుకే తిరిగి పార్టీలో చేరానని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 20 నెలల వ్యవధిలోనే దాదాపుగా 2 లక్షల కోట్లు అప్పు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్ కేవలం సర్పంచులకు రావాల్సిన 1000 కోట్లు ఇవ్వమంటే మాత్రం రాష్ట్రం దివాలా తీసిందని మాట్లాడటం కేవలం తాజా మాజీ సర్పంచులపై కక్ష్య సాధింపు అని ఈ సందర్భంగా తాము తెలియజేస్తున్నామని కరుణాకర్ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుల బిల్లులు, మంత్రుల బిల్లులు చెల్లించడానికి డబ్బులు ఉన్నాయని, కానీ సర్పంచులకు ఇవ్వమంటే మాత్రం డబ్బులు లేవని, సర్పంచ్ల ఉద్యమాన్ని, సర్పంచులను అణిచివేసి పోలీసులచే చిత్రహింసలు పెట్టిస్తున్న రేవంత్ రెడ్డి సర్కారును స్థానిక సంస్థలలో కచ్చితంగా ఓడించి తీరుతామని హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులమందరం ఏకమై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాన్ని మరొక్కసారి ప్రజలకు గుర్తు చేస్తూ, మళ్ళీ తిరిగి బీఆర్‌ఎస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో సర్పంచులందరూ కార్యచరణ రూపొందించుకొని, ఆరు గ్యారెంటీ ల పేరుతో రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్న తీరును నిరంతరం ప్రజలకు వివరిస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెడతామని హెచ్చరించడం జరిగింది.

# రాజ్యాంగ సవాళ్లపై ఢిల్లీలో చర్చ

- **పోస్టర్ ఆవిష్కరించిన సిరిసిల్ల లీగల్ సెల్..**

**బలగం టీవీ, సిరిసిల్ల**




రాజ్యాంగ సవాళ్లు అనే అంశంపై ఆగస్టు 2న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరగనున్న చర్చా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా లీగల్ సెల్ ఆవిష్కరించారు. రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆదేశాల మేరకు, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ ఇరుకుల అశ్విన్ ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా లీగల్ సెల్ వైస్ చైర్మన్ వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో జరిగే ఈ ముఖ్యమైన చర్చా కార్యక్రమంలో జిల్లా నుండి పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బుర్ర రవితేజ గౌడ్, స్పోక్స్ పర్సన్ వంగల కర్ణ, బొద్దుల రాజేష్, రాజూరి రమేష్, జెట్టి శేఖర్, అన్సారీ అలీ, జ్యోతి, సుహాసిని తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది..

- **రైతులకు ఎరువుల కొరత లేదు**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**

రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో నిర్మించిన ఎరువుల గోధంను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు...

అనంతరం ఇందిర మహిళ శక్తి పథకంలో భాగంగా విఘ్నేశ్వర గ్రామైక్య సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదాంను, ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ను ప్రభుత్వ విప్ ప్రారంభించారు .ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు సంబందించిన ఎరువులు విత్తనాలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.. గతంలో రైతులు పడుతున్న సహకార సంఘాలు రైతుల పక్షాన పని చేస్తాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకార సంఘాల ద్వారా ప్రత్యేక చొరవ తీసుకుతుందని, వాటి ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి గతంలో సహకార సంఘాల పాత బకాయిలను రద్దు చేసారని అన్నారు. నేడూ వాణిజ్య బ్యాంక్ లంతో పాటు సహకార సంఘాలు పోటిపడుతున్నాయంటే అది అనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కల్పించిన వేసులుబటన్నారు..



గతంలో మక్కలకు కూడ మద్దతు ధర కల్పించడం జరిగిందని రైతులకు ఉచిత విద్యుత్ అందజేయడం జరిగిందన్నారు..

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు సుమారు 1 లక్షా పై చిలుకు నిధులు రైతులకు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు.. ఏక కాలంలో రుణమాఫీ, సన్నం వడ్లకు 500 బోనస్, ఒకే టోకెన్ లో రైతూ భరోసా వంటి అనేక కార్యక్రమాలను అందజేయడం జరిగిందన్నారు.. ప్రజా ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేదన్నారు...మూడు రోజుల క్రితం మహిళ తల్లులకు చందుర్తి మండలం నర్సింగపూర్ గ్రామంలో,కోనయపల్లి లో ఎరువుల దుకాణాలు ప్రారంభం చేయడం జరిగిందన్నారు.. ప్రజా ప్రభుత్వంలో మహిళను కోటీశ్వరులు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 21 వెల కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు..నియోజకవర్గ పరిధిలో ప్రతీ గ్రామంలో మహిళ సంఘం బిల్డింగ్ నిర్మాణం చేస్తానని తెలిపారు.. నూకలమర్రి గ్రామంతో 1995 నుండీ అనుబంధం ఉందని గుర్తు చేశారు..రైతులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నూకలమర్రి గ్రామంలో నూతన సబ్ స్టేషన్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు..

**ఇందిరమ్మ ఇల్లు పరిశీలన**

నూకలమర్రి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారురాలు దివ్య ఇల్లును ప్రభుత్వ విప్ సందర్శించారు.. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ప్రభుత్వ విప్ కృషితో గత 5 సంవత్సరాల స్వంత ఇంటి కల నెరవేరిందని సంతొషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ రొండి రాజు, ఫ్యాక్స్ ఛైర్మెన్ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వకులబరణం శ్రీనివాస్,వైస్ ఛైర్మన్, డైరక్టర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు..



## పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ..**

**బలగం టివి,ముస్తాబాద్**

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. బుధవారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పాఠశాలలో ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని తద్వారా అన్ అకాడమీ క్లాసులు ప్రారంభించడానికి వీలుగా ఉంటుందని అన్నారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న బెంచీ లను ఇతర పాఠశాలలకు, నిరుపయోగంగా ఉంచిన కుట్టు మిషన్ లను తరలించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో గల ప్లే గ్రౌండ్ కు సిమెంట్ ఫ్లోరింగ్ చేయించాలని, విద్యార్థులు భోజనం చేయడానికి డైనింగ్ రూమ్ లో బెంచీలు ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. స్కూల్ డ్రైనేజీ పైప్ లైన్ మరమ్మత్తు చేయించాలని పేర్కొన్నారు.

ప్రైమరీ పాఠశాలలో అంగన్వాడీ సెంటర్లలో గోడలకు వైట్ వాష్ చేయాలని కలెక్టర్ పంచాయతి సెక్రటరీని అదేవిదంగా అంగన్వాడి సెంటర్లో లైటింగ్ సరిగా లేనందున వెంటనే ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో గడ్డి మొక్కలు పిచ్చి మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయాలని , అదే విధంగా మధ్యాహ్న భోజన పథకం లో భోజనం కట్టెల పై వుండకుండా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామని కావున వెంటనే గ్యాస్ స్టవ్ లను ఏర్పాటు చేసుకొని బిల్లులు కలెక్టరేట్ సమర్పించాలని హెడ్ మాస్టర్ కు ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా తూముకుంట మోహన్ రెడ్డి

**బలగం టీవీ, ఇల్లంతకుంట**





ఇల్లంతకుంట మండల తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా తూముకుంట మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ రాజయ్య, కోశాధికారిగా సార మల్లేశం, అసోసియేట్ అధ్యక్షునిగా ఏ తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షునిగా సామజలపతి రెడ్డి, మహిళా ఉపాధ్యాక్షురాలుగా సాదుల అరుణ, జాయింట్ సెక్రటరీగా పండుగ వెంకటి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యామ మైసయ్య, పబ్లిసిటీ సెక్రటరీగా షాబుద్దీన్, జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా కే మోహన్ రెడ్డి, సిహెచ్ బాల నాగయ్య,లను ఏకగ్రీవంగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో జిల్లా పెన్షనర్ల సంఘం ఎన్నికల బాధ్యులు ఎన్నికలు నిర్వహించారు. మండల పెన్షనర్స్ సభ్యులు మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పెన్షనర్ల సంఘం సభ్యులు టీవీ లక్ష్మణరావు ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా వి రాజిరెడ్డి, జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఎం బలరాం, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల పెన్షనర్ల సంఘం మాజీ అధ్యక్షులు కట్ట నరసింహారెడ్డి, సభ్యులు ఎస్ హరికుమార్ రావు, ఎస్ వెంకటరెడ్డి, ఐరెడ్డి ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## డ్రైవర్లకు అవగాహనా సదస్సు

- **నిర్వహించిన జిల్లా రవాణా శాఖ**

**బలగం టీవీ,తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రవాణా డ్రైవర్లకు లారీ యజమానులకు రైస్ మిల్ ట్రాన్స్పోర్టర్స్ కు డ్రైవింగ్ పై అవగాహన సదస్సును రాజన్న సిరిసిల్ల జిల్లా పదమూడు మండలాల సరుకు రవాణా చేసే లారీ అసోసియేషన్ వారికి డ్రైవింగ్ లో తీసుకోవాల్సిన మెలుకుల గురించి జిల్లా కేంద్రం తంగళ్ళపల్లి మండలం బద్దనపల్లి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్,మోటార్ వాహన తనిఖీ అధికారి వంశీధర్, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ దొరై మురుగన్,ప్రోగ్రాం మోటివేటర్ మనోహర్,రవాణా సిబ్బంది, కానిస్టేబుల్ ప్రశాంత్ హెూమ్ గార్డ్ ఎల్లయ్య పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ అంతక్రియాలలో పాడే మోసిన మాజీ ఎమ్మెల్యే

**బలగం టీవీ, బోయినిపల్లి**

బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ అతికం లచ్చయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురై, బుధవారం రోజున పరమాపదించగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సనుభూతి తెలిపారు. అనంతరం వారి అంతక్రియలకు హాజరై,పాడే మోసారు.వారి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కొండయ్య, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఆజ్జు, మాజీ సర్పంచ్ చిందం రమేష్,నాగుల శ్రీనివాస్,సోషల్ మీడియా కన్వీనర్ బత్తిని కమల్ గౌడ్, కొండగట్టు మాజీ డైరెక్టర్ ముగ్దం కవిత-రవి, బీసీ, ఎస్, సి సెల్ అధ్యక్షులు గురిజాల కోటి, కన్నం సాగర్,యువజన అధ్యక్షులు భూంరెడ్డి, పలువురు బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇల్లంతకుంట కళాశాలలో ఆరోగ్య పరీక్షా శిబిరం



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డా. గౌస్ బాషా, డా. ప్రమోద పాల్గొని విద్యార్థులు, అధ్యాపకుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ శిబిరంలో మొత్తం 158 మంది విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకోగా, వారికి రక్తపోటు, బరువు, హిమోగ్లోబిన్, కంటి చూపు తదితర ప్రాథమిక ఆరోగ్య సమాచారం అందించారు. ఆరోగ్య సమస్యలను గుర్తించి సమయానుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. అలాగే, విద్యార్థులకు ఆహారపు అలవాట్లు, వ్యాయామ ప్రాముఖ్యత, రోజువారి జీవనశైలిలో అనుసరించాల్సిన నియమాలు వంటి విషయాలపై అవగాహన కలిగించారు. పరీక్షల అనంతరం వారు వ్యక్తిగతంగా పలు ఆరోగ్య సూచనలూ అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం పర్యవేక్షణలో శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. అధ్యాపకులు నయీమోద్దిన్, సతీష్ రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మణ్ తదితరులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**బలగం టివి, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ అతికం లచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి భౌతిక కాయనికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చిన చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయినిపల్లి మండల కేంద్రనికి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది కొత్తకొండ మల్లేశం అనారోగ్యంతో మృతి చెందగా వారి భౌతిక కాయనికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి దహన సంస్కారల కోసం ఐదు వేల (5,000/-) రూపాయలు ఆర్థిక సహాయం చేసి అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో చరవాణిలో ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌తో సెమీఫైనల్ రద్దు

**బలగం టీవీ, హైదరాబాద్**





వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో పాకిస్థాన్‌తో జరగాల్సిన సెమీఫైనల్ మ్యాచ్‌ను ఇండియా ఛాంపియన్స్ బహిష్కరించింది. గురువారం (ఆగస్టు 1) జరగాల్సిన ఈ కీలక పోరుకు దూరంగా ఉండాలనే నిర్ణయాన్ని భారత జట్టు అధికారికంగా వెల్లడించింది. ఈ నిర్ణయంతో భారత జట్టు పాక్‌తో పోటీ మ్యాచ్‌లు ఆడబోమన్న తమ స్థైర్యాన్ని మరింత బలంగా నిరూపించింది.

వెస్టిండీస్ ఛాంపియన్స్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపొందిన భారత్ 13.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. టోర్నీలో భారత్‌కు ఇదే ఏకైక విజయం కావడం గమనార్హం. అయితే లీగ్ దశలోనూ పాక్‌తో తలపడాల్సిన మ్యాచ్‌ను భారత ఆటగాళ్ల అభ్యంతరాల కారణంగా నిర్వాహకులు రద్దు చేసిన సంగతి తెలిసిందే.

భారత్–పాక్ మ్యాచ్‌పై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతుండగా, ఈ సెమీఫైనల్‌కి ముఖ్య స్పాన్సర్‌గా ఉన్న ఈజ్ మై ట్రిప్ సంస్థ సైతం తమ మద్దతును ఉపసంహరించుకుంది. "ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంతో క్రీడా సంబంధాలు ఉండకూడదు. ఇది కేవలం మ్యాచ్ కాదు ఇది దేశ గౌరవానికి సంబంధించిన అంశం. 'జాతి ముందు, వ్యాపారం తర్వాత' అనే మా నమ్మకానికి కట్టుబడి ఉండటమే మా బాధ్యత" అని ఈ సంస్థ సహ వ్యవస్థాపకుడు నిషాంత్ పిట్టి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. భారత మాజీ ఆటగాళ్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ వంటి వారు ఇప్పటికే పాక్‌తో మ్యాచ్‌లో పాల్గొనబోమని స్పష్టంగా ప్రకటించారు. వీరంతా భారత్ తరపున బలమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, ఈ నిర్ణయానికి మద్దతుగా నిలిచారు.

## 'ఊపిరి ఊయలగా' ప్రోమో షేర్ చేసిన ఎన్టీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ యాక్షన్ ఫ్రాంచైజీ 'వార్'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'వార్ 2' ప్రస్తుతం భారీ అంచనాల నడుమ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మల్టీస్టారర్ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాణం చేపట్టింది. హీరోయిన్‌గా కియారా అద్వానీ మెరవనుంది. ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు 15 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రమోషన్ కార్యక్రమాల్లో మేకర్స్ వేగం పెంచారు. ఇప్పటికే ట్రైలర్, టీజర్, పోస్టర్లతో సినిమాపై ఆసక్తి పెంచిన వార్కెన నిర్మాతలు, తాజాగా హృతిక్%–%కియారాలపై చిత్రీకరించిన ప్రేమ గీతం ప్రోమోను విడుదల చేశారు. తెలుగులో 'ఊపిరి ఊయలగా ' అంటూ సాగే ఈ పాట ప్రోమోను ఎన్టీఆర్ తన ఎక్స్ ఖాతాలో పంచుకుంటూ, "ప్రేమ అప్రయత్నంగా ఉన్నప్పుడు, అది ఒక కలలా అనిపిస్తుంది... రేపు విడుదలయ్యే ఊపిరి ఊయలగా పాట కోసం సిద్ధంగా ఉండండి!" అని పేర్కొన్నాడు. ఎన్టీఆర్ చేసిన ఈ ట్వీట్‌తో పాటపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ పాత్రకు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇప్పటివరకు గోప్యంగా ఉంచినప్పటికీ, ఆయన పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలవనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హృతిక్, ఎన్టీఆర్ కలయికపై దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## రిషబ్ శెట్టితో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ ప్రాజెక్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**




పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయాన్ని అందుకున్న 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి, ఇప్పుడు టాలీవుడ్‌కు అడుగుపెడుతున్నాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆయనతో కలిసి ఓ విభిన్నమైన సినిమాను తెరకెక్కించనుంది. ఈ చిత్రానికి 'పలాస 1978' ఫేమ్ అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహించనున్నాడు. ఈ విషయాన్ని సోమవారం సంస్థ అధికారికంగా ప్రకటించగా, తమ సోషల్ మీడియా వేదికగా ఓ ఆసక్తికర పోస్టర్‌ను విడుదల చేసింది. "అన్ని తిరుగుబాటులకు యుద్ధరంగమే ఆధారం కాదు. కొన్ని విధిచేత ఎంపిక చేయబడతాయి. ఇది ఒక తిరుగుబాటుదారుని కథ" అంటూ పోస్టర్ పై ముద్రించిన వాక్యాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. అయితే నటీనటుల వివరాలు, కథాంశం, చిత్రీకరణ ప్రారంభ తేదీలాంటి పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయని సమాచారం.

# టీ20లో అభిషేక్ నెంబర్ 1

- ట్రావిస్ హెడ్‌ను అధిగమించిన భారత్ ఓపెనర్
- టీ20 ర్యాంకింగ్స్ విడుదల చేసిన ఐసీసీ

**బలగం టీవీ, హైదరాబాద్**




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ సంచలనంగా నంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా ఎగబాకాడు. తాజాగా జరిగిన ర్యాంకింగ్స్ అప్‌డేట్‌లో ట్రావిస్ హెడ్‌ను వెనక్కి నెట్టి, అభిషేక్ టాప్ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌కు హెడ్ దూరంగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొంది.

అభిషేక్ శర్మకు ఇది కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్ కావడం గమనార్హం. ప్రస్తుతం ఆయన 829 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో కొనసాగుతుండగా, హెడ్ 814 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. ఇప్పటి వరకు 17 టీ20లు ఆడిన అభిషేక్ 33.44 సగటుతో 535 పరుగులు చేశాడు. స్ట్రైక్ రేట్ 193.85 ఉండటం విశేషం. ఇందులో రెండు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో కూడా ఆరు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభను నిరూపించుకున్నాడు.

ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ ఆటగాళ్లు మూడు ఫార్మాట్లలోనూ రాణిస్తున్నారు. వన్డేల్లో శుభ్‌మాన్ గిల్ నంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా కొనసాగుతుండగా, జస్ప్రీత్ బుమ్రా టెస్టు బౌలర్లలో అగ్రస్థానంలో ఉన్నాడు. టెస్ట్ ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా నంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. ఆయనకు బంగ్లాదేశ్‌కు చెందిన మిరాజ్‌పై 117 పాయింట్ల ఆధిక్యం ఉంది. హార్దిక్ పాండ్యా మాత్రం టీ20 ఆల్‌రౌండర్లలో అగ్రస్థానంలో నిలిచాడు.

మాంచెస్టర్ టెస్ట్‌లో రాణించిన రవీంద్ర జడేజా ఐదు స్థానాలు ఎగబాకి బ్యాటింగ్‌లో 29వ స్థానానికి, బౌలింగ్‌లో ఒక స్థానం మెరుగుపరుచుకొని 14వ స్థానానికి చేరుకున్నాడు. అదే మ్యాచ్‌లో జడేజాతో కలిసి ఐదవ వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యం చేసిన వాషింగ్టన్ సుందర్ ఎనిమిది స్థానాలు ఎగబాకి బ్యాటింగ్‌లో 65వ స్థానానికి చేరాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో 13వ స్థానానికి చేరుకున్నాడు.

ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ టెస్ట్ బ్యాట్స్‌మన్‌గా నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్) రెండో స్థానంలో, హ్యారీ బ్రూక్ మూడో స్థానంలో ఉన్నారు. బెన్ డకెట్ 10వ స్థానం, జాక్ క్రౌలీ 43వ స్థానానికి చేరారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ మూడు స్థానాలు ఎగబాకి టెస్ట్ ఆల్‌రౌండర్లలో మూడో స్థానంలో ఉన్నాడు. జోఫ్రా ఆర్చర్ నాలుగు సంవత్సరాల తర్వాత టెస్ట్ జట్టులోకి తిరిగి 38 స్థానాలు ఎగబాకి 63వ స్థానానికి చేరాడు. క్రిస్ వోక్స్ ఒక స్థానం మెరుగుపడి 23వ స్థానంలో ఉన్నాడు.

# అభిమానుల ప్రేమతో సాఫ్ట్ అయిపోయా.

- విజయ్ దేవరకొండ

**బలగం టీవీ, హైదరాబాద్**



విజయ్ దేవరకొండ హీరోగా వస్తోన్న మోస్ట్ అవైటేడ్ మూవీ కింగ్‌డమ్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ సినిమా విడుదలకు అంతా సిద్ధమైంది. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్ రిలీజ్ తర్వాత కింగ్‌డమ్‌పై ఒక్కసారిగా బజ్ క్రియేట్ అయింది. తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విజయ్ దేవరకొండ ఆసక్తికర కామెంట్స్ చేశారు. తానెప్పుడు ఎవరికోసమే మారనని.. ఎవరికీ భయపడనని అన్నారు.

విజయ్ దేవరకొండ మాట్లాడుతూ..'నేనెప్పుడు లోపల ఏది అనిపిస్తే అదే మాట్లాడతా.. కెరీర్ ప్రారంభంలో అగ్రెసివ్‌గా ఉన్నా. అప్పుడు నాలో డిఫెన్స్ ?మెకానిజంతో ఉండేవాన్ని. ఎవరూ నన్ను తక్కువ చేసి మాట్లాడకూడదు. నన్ను నేను ప్రొటెక్ట్ చేసుకోవాలి. నేను అనుకున్నది సాధించాలి. అందుకే కెరీర్ ప్రారంభంలో దూకుడుగా ఉన్నానేమో. మనం సినిమాల్లోనూ చూస్తుంటాం కదా.. హీరో ముందుగా పవర్‌ఫుల్‌గా ఉంటాడు. అమ్మ, అమ్మాయి ఎవరో ఒకరి వల్ల తర్వాత సాఫ్ట్ అయిపోతాడు.' అని అన్నారు. ఆ తర్వాత మాట్లాడుతూ..'ఇప్పుడు నా అభిమానుల ప్రేమతో నేను కూడా సాఫ్ట్ అయిపోయా. ఇప్పుడైతే నాకేలాంటి ఫియర్ లేదు. మొదట్లో నాకు కొద్దిగా భయముండేది. ఇప్పుడైతే అలాంటిదేం లేదు. నా చుట్టూ ఉండే వాతావరణం వల్లే అలాంటి ఫీలింగ్ వచ్చి ఉండొచ్చు. ఇప్పుడైతే ఆడియన్స్ లవ్ వల్ల ఫియర్ పోయి ప్రశాంతంగా ఉన్నా' అని విజయ్ దేవరకొండ తెలిపారు.

ఈ చిత్రం స్పై జానర్‌లో రాబోతుండడంతో ఇందులో ఎల్‌టీటీఈ (లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం)కి సంబంధించిన ప్రస్తావన ఉండబోతుందని సోషల్ మీడియాలో చర్చ జరిగింది. అయితే ఈ వార్తలపై క్లారిటీ ఇచ్చాడు నటుడు విజయ్ దేవరకొండ. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ ప్రస్తావన ఉండదని తెలిపాడు. కానీ అలాంటి టైమ్‌లైన్‌లో జరిగిన కథగా ఈ సినిమా రాబోతుందని విజయ్ తెలిపాడు. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం అనే సంస్థను శ్రీలంక ప్రభుత్వం ఉగ్రవాద సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే.

నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ.. ప్రేక్షకులను మోసం చేయవద్దనే ఈ సినిమా కథను బయటపెట్టామని తెలిపాడు. తప్పుడు అంచనాలతో ప్రేక్షకులను సినిమాకు రాకుడదు అనే ఉద్దేశ్యంతోనే ఈ సినిమా కథను ట్రైలర్‌లో రివీల్ చేశాం. అంతేగాని వేరే ఆలోచన లేదు. ప్రేక్షకులు ఈ సినిమా చూడటానికి వచ్చినప్పుడు వారికి ఒక అంచనా ఉండాలి. ఈ సినిమాతో గౌతమ్ ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించాడు. ఇది జెర్సీ తీసిన గౌతమ్ కింగ్‌డమ్ అంటూ నాగవంశీ చెప్పుకోచ్చాడు.

**పవన్ కల్యాణ్‌ను కలిసిన 'కింగ్‌డమ్' టీం**

పవన్ కల్యాణ్ ప్రస్తుతం నటిస్తున్న "ఉస్తాద్ భగత్ సింగ్" సినిమా సెట్స్‌ను "కింగ్‌డమ్" చిత్రబృందం సందర్శించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ, నిర్మాత నాగ వంశీ, హీరోయిన్లు భాగ్యశ్రీ బోర్స్, శ్రీలీల పవన్ కల్యాణ్‌ను కలిశారు. "పవన్ కల్యాణ్ సార్‌ను కలవడం ఎంతో ఆనందంగా అనిపించింది. చాలా ఆత్మీయంగా స్వాగతం పలికారు. 'నాకు ఒంటరిగా ఉండడం, నిశ్శబ్దం ఇష్టమని' ఆయన మొదట చెప్పారు. కానీ చివరికి మేము చాలా గంటలపాటు మాట్లాడుకుంటూనే ఉండిపోయాం. ఆయన ఆశీర్వాదం తీసుకున్నాం. ఆయన ఆరోగ్యం, ఆనందం కోసం ఎప్పుడూ ప్రార్థిస్తాను," అని విజయ్ తన పోస్టులో పేర్కొన్నాడు.

**టాలీవుడ్ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆమె తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్ (67) జూలై 28న కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన సోమవారం తుది శ్వాస విడిచారు. తండ్రి మరణం పాయల్‌కు తీరని లోటుగా మారింది. తన బాధను ఆమె సోషల్ మీడియా వేదికగా వ్యక్తం చేయగా, ఇది అభిమానులను కలచివేసింది."నాన్నా లవ్ యూ, మిస్ యూ" అంటూ పాయల్ రాజ్‌పుత్ భావోద్వేగానికి గురయ్యారు. "నాన్నా నువ్వు ఇక భౌతికంగా నాతో ఉండకపోయినా నీ ప్రేమ నాలో ఎప్పుడూ ఉంటుంది. నీ నవ్వు, నీ శబ్దం, నీ హత్తుకునే శైలి ప్రతిదీ గుర్తుకువస్తుంది. ఈ లోకం నుంచి నువ్వు వెళ్లిపోయినప్పటికీ, నా హృదయం నుంచి నువ్వు వెళ్లలేవు. లవ్ యూ పప్పా" అని ఆమె పోస్ట్ చేసింది.**

